# అవును నిజం

## 1

కప్పునిండా ఉన్నది టీ; స్పూన్ రవంత అలికిడికే పొరలి సాసర్‌లోకి పాళంగా ఒలికిపోయేటంత నిండా.

ఆవిరితెరలు అతినాజూకైన తీవెలుగా చిరుగా మెలిపడుతూ అజంతా అల్లికల అందాలలోకి సాగేయత్నంతో....

బల్లమీద తలవంచి—కప్పు అంచున పెదవులు ఆనించి....పీల్చి....చురుకు తగిలినచోట నాలికతో సంబాళించుకుని....ఊపిరి గుక్కపట్టి, తగని ప్రయత్నంతో....

'భాయీ! అనుకున్నంత పనీ జరిగింది....చివరకు....' అని పళ్ళ సందులనుంచి ఊదాడు, శేఖరం.

సర్దుకు కూర్చుందామని, కొంచెం మసలేటప్పటికి....తనివి హెచ్చిన దక్షిణ నాయిక అయి....మన కుర్చీ....కొరకొరలాడింది...'ఎవరు అనుకున్నంత?' అన్నాను, ప్రశ్నలాగా కాకుండా.

అందుకు ఏమీ సమాధానం చెప్పలేక....ఊహలకోసం చూపులతో నాలుగు మూలలా వెదకి....అనవసరంగా గొంతు కొరబారించుకుని...సవరించుకునే రొదలో కలిపి....'మే మిద్దరం పెళ్ళిచేసుకుందా మనుకుంటున్నాం...."

"నాకు తెలుసును"

"అని నాకు తెలియదే!"

"ఎవరి లోపం?....మరి ఇన్నాళ్ళూ....నా కళ్ళకు పసగగా....కలువరేకులూ, చిగురుటాకులూ మెసలలేదు కాదోయ్....మన చూపు....దేవరకులాగా మందగించ లేదని మనవి...అని తప్పుగా అర్థం చేసుకోమోక....వయసులో నీ కన్న పెద్దవాడను కనుక....సూచనలన్నీ కొంచెం త్వరగా పసికట్టానని భావార్థం....శుభం...."

"ఆ అమ్మాయి...."

"ఎవరో తెలుసునులే....ఇలా పిలు....ఓ మారు చేయి అందించి....ఉలిక్కి-పడక....అదుగో ఆ చివర నిలుచుని నీ కోసం వెదుకుతూంది: ఉహుం, చేయి విసరడం లాయకీ కాదు....చేయి పట్టుకుని నడిపించుకుని రా...."

అతడు తిరిగి వచ్చేలోపల....నేను బయటకు దూసుకున్నాను. ఇంకో గంటలో బ్లూమౌంటెన్ ఎక్స్‌ప్రెస్ కదులుతుంది: మళ్ళా రెండు నెలలదాకా తిరిగి రానుకదా.

## 2

రెండు గుక్కలకే కప్పు ఖాళీ అయిపోయింది. మరగ కాగిన పాలమీగడ అటూ ఇటూ పై అంచులను అక్కడక్కడ ఆవరించి ఉన్నది. వంచినతలను నిలువు బారున సిగరెట్ పొగ రాజుతూ ఉన్నది.

"అనుకున్నంత పనీ అయింది" అన్నాడు శేఖరం....కొంచెం కటువుగా.

"ఎవరు...."

"నీవు....నేను గ్రహించాను. మే మిద్దరం మళ్ళా.... మొదట మనం హోటలులో కూర్చున్న చోటికి వచ్చేటప్పటికి...నీవు మాయం కావడం అప్పుడు కష్టం వేసిందనుకోగాని....గమనించి సరిగా నడుచుకుంటే ఈ కరకర తప్పేదేమో...."

"ఏమో"

"ఏమో?....ఎలా ఆమెను వరించానో....ఎందుకు నీ సహవాసం చేస్తూ కూడా మేలుకోలేకపోయినానో....ఏమో?"

"ఏమో...."

"ఏమో కామోలనుకునే ...ఎంతకైనా....చేసినది తప్పు కాదని మనసును మోసగించుకుంటున్నాను. హనీమూన్‌కు...మసూరి వెళ్ళాము. ఆనందనభోగం.... అదే మొదలూ ఆఖరూ.....అంత హృదయమిచ్చి పిలుచుకున్న ఆనందానికి...."

"కష్టపడుతున్నానని చెప్పడానికి....కవిత్వంలోకి దించే ముచ్చట మనకు పూర్వాశ్రమంలో తీరిపోయింది....కాస్సేపు పత్రికా విలేఖరి పాత్రను ధరించి....నీకు యిష్టం వుంటే.... అసలు గొడవ ఏమో చెప్పు."

"అదే తెలియకుండా ఉంది....ఆ అడ్డంకి తీరే అంతవరకూ ఆమె కనపడకుండా ఒక నిమిషం వుండలేకపోయేవాడిని .... ఇప్పుడు క్షణం నిలువలేను .... కారణం తెలియదు....మే మిద్దరమూ పోట్లాడుకోమూ.... మనసిచ్చి మాటా మాటా ఆడుకోము."

"బాగానే వుంది....."

"ఏమీ బాగాలేదనేరా నేను యిందాకనుంచీ మొరపెట్టుకుంటూన్నది. బోనులోపడ్డ చిట్టెలుక ఎదురుగుండా పిల్లి కాపలావుంటే ఎలా అటమటించుతుందో .... అలా.... నేను ఎటు మెసలినా ..... ఏ పనిచేసినా....ఆమె చూపులు నా వెన్నువెంట .... నాకు తెలియకుండా....ఏ అపార్థం బయటకు లాగుతున్నదో అనే ఆరాటం...."

"నాయకుడు అనుకూలుడైనప్పుడు...."

"అందువల్లనే....యీ రగడ పెరుగుతూందేమోననుకుంటూ ఒక్కొక్కప్పుడు. ఎంతదాకా వచ్చిందంటే.....ఆమె నన్ను యిలా చిక్కి శల్యమయేటట్టు చేస్తూన్నదని... ద్వేషించడం కూడా మొదలు పెడుతూన్నానేమో....నన్ను నే నెరగకుండానే...."



కథా నిలయం
3668

"చనువుగా దగ్గిరకు వెళితే...."

"బలవంతంగా బందాలు వేసి .... కముచుకుంటూన్నదనే....యింత బాధ. నన్ను ఏం చేయమంటావు?"

"నన్ను ఓ పూట టీకి పిలవరాదూ?"

"పిలిచే తాహతు తప్పిపోయిందని తెలుసుకుని....ఎందుకు బాబా .... ఈ దీనుణ్ణి యింకా నొప్పించడం? .... ఇప్పుడల్లా....పిలిచేవేళకు - ఆమె కోరిన రీతిగా... ఎదుటపడి ....పురివిప్పి నాట్యం చేయడమే... యీ సాలభంజిక....కాని....నిన్ను నేను పిలువక పోనులే....ఎప్పటికైనా...."

# 3

ఇద్దరికీ అందుబాటులో టీపాట్ ఉన్నది....రెండో తడవ నిండిన కప్పులు.... సమపాళంగా సగంవరకూ తరిగి ఉన్నవి....

"అనుకున్నంతా ....అయింది...." మళ్ళా చాలా ఉత్సాహంతో ఆ మాటే రెట్టిస్తూన్నాడు శేఖరం. "నేను....అలా అనుకోడానికి యిన్ని నెలలు పట్టినా ఆచరించే సత్తా అబ్బడానికి యింకా యింతకాలం అయినా...యిప్పటికి....లోపం అంతా మనలోనే ఉన్నది అని గ్రహించాను."

"రైట్...."

"అవును భాయీ! నా ఆశలకు...అప్పట్లో అంతులేకుండా చేసుకున్నందువల్ల యిన్ని అగచాట్లు రాక తప్పలేదు. మంజరి....హంసగమనంతో నేలమీద నడిస్తే అందం తక్కువౌతుందనా....ఆకాశంలోకి ఆ అమాయకురాలిని విసిరివేస్తే అంత అవకాశంలో రేగే ఆశలకు అంతు ఏమిటి? అక్కడనుంచి....ఆలింగనంకోసం ఆహ్వానించాలని కలవరింత...."

"గాలి పడగకు దారం వదిలినకొద్దీ....గాలి పోసుకుంటుంది .... గిరికీ కొడుతూంటే కళ్లు అప్పగించి చూస్తూంటే....కాలు ఓ చోట నిలవదు....మెడా చేయీ బెణకక మానవు...."

"అవును....అందులో హోరుగాలిలో అంత ఎగువకు పోనీయకూడదు. ధూకుడు ఎక్కువై తెగిపోతే....పడగ....ఎక్కడో చిక్కుకుని పాడైపోతుంది.... దారం ఉండచుట్టుకు....చేతికి చివరకు ఏమీ మిగలదు."

"అలా అయేటంతవరకూ వచ్చింది...కాని, ఎవరో వెన్ను చరచినట్లుగా... ఎంతలో మెళకువ వచ్చిందనుకున్నావు?....కళ్ళు తెరిచినా....ఇంకా సాగిపోతూనే ఉంది. ఆ విచ్చుకత్తుల బరాబరి....కావ్యం....కామిని"

"ఎవరికి జయం ?"

"ఎవరిత్రోవ వారిదైన తరువాత కాని .... ఆ హోరు తగ్గలేదు....నేను.... ఎంత...."

"అమాయకుడివి అయితే....కవిని కానే కావు; అర్భకుడివి. ఒక్కటేమాట. కావ్యం కావాలా....అందులో రసాల అలలమీద తేలిపోతూ ఊగడానికి హాయిగా.... వెన్నెలా, కోయిల యీలా....మావినీడా....మెదిపి ముంజచేసి....కామినిగా విచ్చి.... ఎగరవేయి....ఎటు చూసుకున్నా....మనసు దానితో .... పరుగెత్తుతుంది. కలిసి మెలసి....కాంతతో కాపురం చేయాలనుకుంటే....ఆమె ఛాయలకు....కావ్యాలాపాలను రానీయమోక. దేనికీ....దాని హద్దులు ఉన్నాయి....ఎరిగి ఉపయోగించుకోటంలో వుంది శిల్పం. పుస్తకాలలో....చిత్రించే దేవీమూర్తి విషయంలో....పూజ్యభావం... దాసభావం...."

"అంతేనా....ఏరికోరి వరించిన అమ్మాయిలో ఆ హంశలన్నీ అచ్చించుకుని...."

"ఉబ్బిపోదామనుకోవడంకన్న మరో పొరబాటు లేదేమోనని....అనుభవంమీద చెపుతున్నాను సుమా! మనలోవున్న 'మెసాకిజం'....ఈ జబ్బుకు కారణం. పుచ్చె విడిపోయేటట్టు....చేతి సత్తువకొద్దీ నెత్తిన ఒక పెట్టుపెట్టి జుట్టుపట్టుకు చరచరా లాక్కునివెళ్ళి....ఏ గుహలోనో....గృహిణిని ఏర్పాటు చేసుకున్న ఆదిమూర్తుల కన్న....మనకేం సౌఖ్యముంది నిజానికి. వాళ్ళ కావ్యాత్మలముందు మన అలసార్చటుట ఏ మూలకు. ఆడది....స్త్రీ అని కూడా అనక్కరలేదు....గౌరవించినా, కామించినా.... ఏమైనా....ఆమె....అంతవరకే...."

"మరి, మన స్మృతులు...."

"మనవైతే....యింతకాలం నిలిచేవికావు. మనువు చెప్పాడని....మనం చేతులు జోడించడం...."

"గాథ చాలా పెరుగుతూన్నది—"

"పెరిగింది గనుకనే....యింతవరకూ సాగింది. నీకు తెలిసి రావాలనే.... నేను ఇంతవరకూ మెదలకుండా వూరుకున్నది. నీవేకాదు....కవి అనేవాడు ఎవడు సుఖపడుతున్నాడు?....అది ముమ్మాటికీ వాడి లోపమేననుకో."

"నిజమే····కాని తరచినకొద్దీ అయోమయంగా ఉంటుంది."

"అదే....కవిత్వానికిదారి....మళ్ళా మొదటికిరా. నీకళ్ళముందర దేవీమూర్తులు ఎప్పుడూ మెలగుతూండాలనీ....వాళ్ళు అందీ అందకుండా ఉండాలనీ....అందరూ వచ్చి....ఆ అమ్మాయిలో గూడు కట్టుకోవాలనీ....ఎందుకోయి కవి ననుకుని అంత అహంకారం? నిన్ను చేసుకువి....నీ మామూలు సుఖదుఃఖాలలో భాగస్వామిని కావలసిన పిల్లవంక....అర్థం చేసుకో నీలులేని····అనిమేషదృష్టు లెందుకోయ్. అస లక్కడ....నీ ఉబలాటమేకాని....అంతకన్న సరుకు ఎక్కువలేదోయ్. భగవంతుడు, దయతలచి పశు పక్షి గణానికి మెదడు తక్కువ చేయబట్టికాని....అవికూడా ఆడ జాతిని దేవీమూర్తులక్రింద మార్చి ఆకాశంలోకి వదిలితే....రంగా...ఆ కోలాహలం యిక చెప్పనా ..."

"ఇంతటితో దయతలచి వదులుదూ"

"వదలకుండా....చక్కని సంసారివి అవుతావా?....అమరధామం పొలిమేరల్లో ఉంది కనుక....ఇంతదాకా బుద్ధి····అరవ హోటలులో టీ ఇప్పించవలసి వస్తూంది... ఇక ఎన్నడైనా....మీ యింటికి విందనే!"

"కటువుగా లేదూ....అలా విసరడం..."

"కావ్య–కషాయిత అయిన కామిని కూడా అంతేనని మనవి చేయడానికే ప్రభూ! తల నెరపు చూపినప్పటినుంచే...కావ్యాతపం....కామినీలోకం దేవీశీతలాన్ని ఊదరగా చెరిగేసింది....ఆదరణ రెచ్చిపోయి....ఎవరికి ఎవరు చిక్కాలో తెలియ కుండా....చిక్కి పాలిపోయి ఎక్కడో చూసే....గణబద్ధ ప్రణయాలు....కాస్సేపైనా లేకుండా...టీ త్రాగి....ఎంత కాలమైంది—"

●